


తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా ‘కౌముది‘ పాఠకులకి
ప్రముఖ రచయిత కలం నుంచి నెలనెలా ప్రత్యేక వ్యాస పరంపర

## చింతనా నిరంతరం గోపీచంద్

(1910 - 1962)



**గోపీచంద్** రచనా వ్యక్తిత్వం నిరంతర చింతనతో, అన్వేషణతో సాగింది. హేతువాద ఉద్యమ సారథి త్రిపురనేని రామస్వామి చౌదరి బిడ్డగా, ఎందుకు? ఎలా? అనే ప్రశ్నలు గోపీచంద్‌ను బాల్యం నుంచే ఒక జిజ్ఞాసువుగా రూపొందించాయి. ఈ ప్రశ్నలకు తన జీవితానుభవాల్లో ఆయన సమాధానాలను ఆవిష్కరించుకున్నారు. హిందూ సంఘంలోని ఆత్మ వంచననూ, ఆత్మముగ్ధత్వాన్నీ, వ్యక్తి చైతన్య రాహిత్యాన్నీ గోపీచంద్ రచయితగా ముందు ప్రశ్నించారు. మోహాలకూ, ప్రేమలకూ, ప్రణయాలకూ, ఆకలికీ మధ్య ఉండే సంబంధాల వివేచనతో సమాజాన్ని నడిపించే ఆర్థిక శక్తుల గురించీ, రాజకీయాల గురించి ఆ తర్వాత పట్టించుకున్నారు. గ్రామీణ సమాజంలోని భూ సంబంధాలనూ, ఆస్తి మమకారాలనూ పరిశీలించారు. రాజకీయ కార్యక్షేత్రాన్ని నిశితంగా, సన్నిహితంగా తన రచనల్లో ప్రతిఫలించారు. మార్క్సిస్టు సిద్ధాంతాలూ, ఆచరణ పద్ధతులూ ఆయనను సంతృప్తి పరచలేకపోయాయి. స్వార్థ సంకుచిత రాజకీయాల వల్ల ‘దేశం ఏమయేట్టు?‘ అని అలజడికీ, ఆందోళనకూ గురి అయ్యారు. క్రమక్రమంగా నవ్య మానవతా వాదం వైపూ, అస్తిత్వవాదం వైపూ, ఆధ్యాత్మిక చింతనవైపూ వెళ్ళారు. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యమూ, తత్వశాస్త్ర సిద్ధాంతాలూ గోపీచంద్ జీవిత సత్యాన్వేషణకు దోహదపడ్డాయి. బుద్ధిజీవుల రచయితగా పేరు తెచ్చుకున్నారు.

1928 లో ‘శంబుక వధ‘ కథతో గోపీచంద్ రచనా జీవితం మొదలైంది. అప్పటికి ఆయన వయసు పద్దెనిమిదేళ్ళు. 1962 లో మరణించే వరకూ వివిధ సాహిత్య, సాహిత్యేతర రచనలను చేశారు. ఆంధ్ర రాడికల్ డెమోక్రటిక్ పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. సినిమా రంగంలో ‘రైతు బిడ్డ‘, ‘గృహప్రవేశం‘ చిత్రాలకుసంభాషణలు రాశారు. కొన్ని చిత్రాలకు దర్శకత్వం వహించారు. రాష్ట్ర సమాచార శాఖలో, ఆకాశవాణిలో పనిచేశారు. ఈ అనుభవాలూ, ఆయన నిరంతర పఠనం, ప్రశ్నించే స్వభావమూ రచనా విస్తృతికి తోడ్పడ్డాయి. మూడు వందల దాకా కథలనూ, పదకొండు నవలలనూ కొన్ని నాటికలను నాటకాలను, గల్పికలనూ రాశారు. ‘పోస్టు చెయ్యని ఉత్తరాలు‘, ‘ఉభయకుశలోపరి‘, ‘మాంచాల‘, ‘తత్వమసి‘ వంటి ఇతర రచనలను చేశారు.

కథా రచయితగా గోపీచంద్ వివిధ సామాజిక సమస్యలను చిత్రించారు. కథా శిల్పంలో ప్రయోగాలు చేశారు. తెలుగులో విమర్శనాత్మక వాస్తవిక వాదాన్ని బలోపేతం చేశారు. తెలుగు కథలో ప్రగతికాముకత్వం తప్ప, శిల్ప ప్రయోగాలు లేవని కొందరు భారతీయ సాహిత్య విమర్శకులు అంటుంటారు. తెలుగు కథారచయిత ప్రయోగ వైచిత్రీ, నైపుణ్యమూ వారి దృష్టిలో పడకపోవడమే దీనికి కారణం. గోపీచంద్ సూటి కథనానికి ప్రసిద్ధి. కథన శిల్పంలో ఫాంటసీకి సైతం కొన్ని ఉపయోగించుకున్నారు. కొన్ని కథలకు సంఘటనలు ప్రాణం కొన్ని కథలకు సంభాషణలు జీవం. కొన్నిటికి మనస్తత్వాలూ, నేపథ్యమూ కేంద్రకం. ఆయనది ఆలోచనా భరమైన నిరలంకార శైలి. కథల్లో పాత్ర సామాజిక మనస్తత్వ చిత్రణ మీద ఎంతో శ్రద్ధ చూపారు. పాత్రల సామాజిక ప్రవర్తననూ ఆ ప్రవర్తనను శాసించే అంతరంగాన్నీ చిత్రించారు. మనుషుల చర్యలకూ, మానసిక వికారాలకూ మధ్య ఉండే సంబంధాన్ని ఎత్తి చూపారు.

'పతివ్రత అంతరంగం' అనే కథను పరిశీలిద్దాం. ఈ కథ పతివ్రతగా పేరు తెచ్చుకున్న ఒక భర్తపోయిన స్త్రీ అంతరంగ కల్లోల చిత్రణ. ఆమెలో కలిగిన పురుష వాంఛతో కూడిన ప్రేరణలు మనల్ని భయకంపితుల్ని చేస్తాయి. మన సమాజంలోని విధవల దయనీయ స్థితిని గురించి తీవ్రమైన అనుకంపనకూ, ఆగ్రహానికీ గురి చేస్తాయి.

గోపీచంద్ భావకవుల అమలిన శృంగార దృక్పథాన్నీ, చలం స్త్రీవాదాన్నీ తన కథల్లో విమర్శించారు. భౌతికవాదాన్నీ, మనోవిశ్లేషణ సిద్ధాంతాలనూ రెంటినీ గోపీచంద్ విశ్వసించడం వల్ల, గోపీచంద్ పాత్రలకు మరింత విశ్వసనీయత అలవడింది. 'వెంకట చలం పాత్ర' అని చలం దృక్పథం మీద మంటతో రాసిన కథకు ఈ విశ్వాసమే కారణం.

గోపీచంద్ కథల్లో గ్రామీణ జీవితాన్ని చిత్రించిన కథలు కొన్ని ఉన్నాయి. వాటిలో 'మమకారం', ధర్మవడ్డీ' ముఖ్యమైనవి. మమకారం ఒక రైతు అమాయకమమైన మట్టి ప్రేమను తెలిపే వ్యక్తిత్వ చిత్రణ. రోజూ శ్రమించే పొలంలోని మట్టిని గుప్పెట్లోకి తీసుకుని రేగడి, మట్టివాసన చూస్తూ మట్టిలో కలిసిపోయిన రైతు జోగయ్యమామ చిత్రణ భారతీయ రైతు సగటు మనస్తత్వాన్ని పట్టి చూపుతుంది. జోగయ్యమామలాంటి కొందరు పెద్ద మెట్ట రైతులు కూడా మట్టిని నమ్ముకుని బతికే నేలతల్లి ప్రేమికులు. ధర్మవడ్డీలోని సూరయ్య లాంటి రైతులది కేవలం మట్టి అనుబంధంకాదు. అది డబ్బు యావ, గ్రామీణ జీవితంలో ప్రవేశించిన వ్యాపార దృష్టినీ, సంపద మూలంగా తలయెత్తిన దురావేశాలనూ, వంచననూ 'ధర్మవడ్డీ' నాటకీయంగా చిత్రించింది. వడ్డీ వ్యాపారి అయిన సూరయ్య, బాకీదార్లకు చులకన కావడంతో పిచ్చివాడవుతాడు. వడ్డీ వ్యాపార సంస్కృతిని 'ధర్మవడ్డీ' చిత్రించడానికి ప్రయత్నించినా, ఆ కథలోని సూరయ్య వాస్తవిక పాత్ర కాదనే విమర్శ ఒకటి ఉంది. అంటే ఒక సామాజిక వర్గం సామాన్య లక్షణాలకూ, సామూహిక ప్రవర్తనా రీతికి నమూనా కాదని అర్థం. సూరయ్య పాత్ర చిత్రణలో గోపీచంద్ భారతీయ రైతుల నైతిక దృష్టి వ్యక్తమవుతుంది. ధర్మవడ్డీ చలనచిత్రంగా కూడా రూపొందించిన కథగా ప్రసిద్ధి పొందింది.

గోపీచంద్ సమకాలిక రాజకీయాల మీద రాసిన కథలు: 'దేశం ఏమయ్యేట్టు', 'కార్యశూరుడు', 'బీదవాళ్ళంతా ఒకటి', 'పీడిత హృదయం', 'గోడమీద మూడోవాడు', 'పీడకల' వంటివి. అవి నాటి రాజకీయాలనూ, సామాజిక వైరుధ్యాలనూ అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయి. వాటి ఈనాటి సాహిత్య సందర్భ శుద్ధి మాట ఎట్లా ఉన్నా, రాజకీయాలు తిరిగే మలుపుల్లో మారే మనుషుల చర్యల వెనుక ఉండేకారణాలను ఆలోచింప చేయడానికి, ఆ కథలు పనికి వస్తాయి. రాజకీయాల్లోని యువకుల ఆదర్శాలనూ, కొందరి మనఃప్రవృత్తుల లీలా విన్యాసాలనూ ఈ కథలు పట్టి చూపుతాయి. సాహిత్యంలోని ఊహాత్మక కాల్పనిక దృష్టిని గోపీచంద్ సహించలేక పోయారు. రాజకీయాల్లోని నినాదాలన్నీ వ్యక్తి స్వార్థాన్నీ, భరించలేకపోయారు.

గోపీచంద్ రాసిన కథల్లో ప్రముఖంగా చర్చించుకోవలసినవి స్త్రీ కేంద్రంగా రాసిన కథలు: స్త్రీ, పురుష సంబంధాలలోని దూరాన్నీ, దగ్గరితనాన్నీ, ఘర్షణనూ చిత్రించిన కథలు. ఆర్థిక సామాజిక, రాజకీయ సమస్యలు స్త్రీ పురుష సంబంధాల్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో ఈ కథలు వెల్లడిస్తాయి.

ఉదాహరణకు 'పునస్సమాగమం' అనే కథను తీసుకుందాం. లేచిపోయి తిరిగి భర్త దగ్గరకు చేరిన ఒక ఇల్లాలు కారణంగా భర్తలో ఏర్పడిన ప్రతిస్పందనను పునస్సమాగమం కథ చిత్రించింది. భార్యాభర్తల భిన్నప్రవృత్తులు, భార్య చొరవ, భర్త బెరుకు ఒక సమన్వయానికి రాగలిగిన స్థితిని గోపీచంద్ చిత్రించారు. లేచిపోయి తిరిగి వచ్చిన భార్యలోని సానుభూతినీ, అభిమానాన్నీ, కరుణనూ, అమాయకుడైన అతన్ని ఆదుకోవాలనే ఆకాంక్షనూ గమనించినా వాటికి భర్త ప్రతిస్పందించలేకపోతాడు. కసురుతాడు. దీనుడైన భర్త దరిచేరి అనునయించే వేళకు భర్త కరిగిపోతాడు. లోక సాధారణ నీతికి భిన్నంగా ఉండే చిత్త వృత్తుల విన్యాసం, ఈ కథ ద్వారా ప్రస్ఫుటమవుతుంది. ప్రసిద్ధ విమర్శకులు ఆర్.ఎస్. సుదర్శనం అన్నట్లు పునస్సమాగమం "మానవమనస్తత్వపు లోతుల్ని తరచి ఆవిష్కరించిన విశిష్టమైన రచన. ఇందులో లోకం దృష్టికీ, వ్యక్తి అంతరంగానికీ గలదూరం తేడా, స్పష్టం చెయ్యడంలో గోపీచంద్ నైపుణ్యం మెచ్చుకో తగింది. అంతరంగానికి ప్రాధాన్యమివ్వడమే మానవత్వం నిరూపించకోవడం అదే సుఖప్రదం కూడా అని సందేశం."

'కూపస్థమండూకం' అనే కథ శ్రామికుల జీవన వాస్తవికతను చిత్రించిన కథ. పరస్పర సంబంధాలు లేని నలుగురు మనుషులకు - ఇద్దరు రిక్షావాళ్ళూ, ఒకచేతి బండివాడూ, మరో తోపుడు బండివాడూ - అన్నం వండిపెట్టే ఒక శ్రామిక స్త్రీ చుట్టూ అల్లిన కథ ఇది. వంట వండే స్త్రీ కాంతమ్మ గర్భవతి అవుతుంది. కాంతమ్మకు నలుగురితోపాటుగా మరో కొందరితో సంబంధాలున్నాయి. తండ్రి ఎవరో ఎవరికీ తెలియదు. గర్భస్థ శిశువుకు ఈ నలుగురిలో పాపారావు అనే శ్రామికుడూ తండ్రిగా నిలుస్తానని ముందుకొస్తాడు. కాంతమ్మ ప్రసవించాక మరణిస్తుంది. బిడ్డ బరువును పాపారావు మోయడానికి సిద్ధపడతాడు. పాపారావు మంచితనం మిగతా వాళ్ళకు అర్థమవుతుంది. శ్రామిక వర్గంలోని ఆపేక్షలూ, మధ్య తరగతి నీతులను పట్టించుకోని ప్రేమా, కరుణా, ఆత్మీయతా ఈ కథ ద్వారా వ్యక్తమవుతాయి.

భిన్న సంస్కారాల కారణంగా కుటుంబంలో భార్యాభర్తల మధ్య తలయెత్తే సమస్యలను చిత్రించిన కథ 'స్వయంకృతం'. భార్యాభర్తలు పార్టీ రాజకీయాల్లో లీనమైన భర్తనూ, వాటికంటే తమ బంధమే ముఖ్యమనుకునే భార్యనూ చిత్రించిన కథ ఒడి దుడుకులు స్త్రీల కర్మలోలూపతను చిత్రించిన కథ. కొడిగట్టిన జీవితాల్లో చిగురించే ఆశను చిత్రించిన విలక్షణమైన తాత్విక కథ 'ఆశాజ్యోతి'. ఈ కథలో గోపీచంద్ అస్తిత్వవాద ఛాయలు గోచరిస్తాయి. ఇతర కథల్లో ఎక్కువగా కనిపించని కవితా స్పర్శ ఈ కథలో కనిపిస్తుంది. బతకడమే ఒక ఆనందం అనీ దేనికోసం బతకడం అర్థంలేని ప్రశ్న అనీ ఈ కథ సందేశం.

గోపీచంద్ తరాల మధ్య అంతరాలను సైతం కొన్ని కథల్లో చిత్రించారు. 'తండ్రులూ, కొడుకులూ' కథ దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గోపీచంద్ భిన్న సామాజిక సమస్యల మూలాలను అన్వేషించడానికి కథా రచయితగా ప్రయత్నించారు. ఆ అన్వేషణలో భాగంగా మానవ మనస్తత్వాలలోని వైవిధ్యాన్నీ, వైచిత్రినీ, అనుభవ గాఢతనూ, స్పందనా రీతులనూ గోపీచంద్ లోతుగా తరచి చూడడానికి ప్రయత్నించారు. మనిషిని సామాజిక జీవిగా, మానవత్వాన్ని కోల్పోని హృదయ చలనశీలిగా ఆయన నిశితంగా పరిశీలించారు. తన కథా సాహిత్యంలో ప్రతిఫలించారు.

గోపీచంద్ కథల్లో ఇతివృత్త వైవిధ్యం కనిపిస్తుంది. పాత్ర చిత్రనలో వాస్తవిక గుణంతో పాటు, ఆదర్శీకరణ కనిపిస్తుంది. రాజకీయ సిద్ధాంతాలూ, మనోవిశ్లేషణా, తాత్వికాన్వేషణా ఆయన కథా రచనను ప్రభావితం చేశాయి.

చలం రచనల అభిమానిగా కథారచనను ప్రారంభించిన గోపీచంద్ చలం దృక్పథంలోని పరిమితుల్ని గ్రహించి, భౌతికవాదం వైపు సాగారు.

"ఒక వ్యక్తి ఒక దృక్కోణం నుండే పరిశీలించి వ్రాయవచ్చు. లేక వివిధ దృక్కోణాలలో తరచి చూచి చిత్రించవచ్చు" అని గోపీచంద్ అంటారు. మనుషులను తరచి చూచిన రచయిత గోపీచంద్.